## వేధిస్తున్న కాల్ డ్రాప్స్!

### సర్వేలో 89 శాతం మంది వెల్లడి

న్యూఢిల్లీ, జూలై 15: ఫోన్ కాల్ మధ్యలోనే కట్ కావటం (కాల్ డ్రాప్) అనేది గత మూడు నెలల్లో 89 శాతం మందికి ఎదురైందని తాజా సర్వే ఒకటి తేల్చింది. దీంతో ప్రతి 10 మందిలో 9 మంది వైఫై నెట్‌వర్క్ ద్వారా ఫోన్ కాల్స్ చేశారని, ఇందుకోసం కాలింగ్, మెసేజింగ్, ఓటీటీ యాప్స్‌ను ఉపయోగించారని 'లోకల్ సర్కిల్స్' అనే సర్వే సంస్థ సోమవారం వెల్లడించింది. ఓటీటీతో వైఫై కాల్స్ గత రెండేండ్లలో పెరిగాయని పేర్కొన్నది. మార్చి-జూన్ మధ్య సర్వే నిర్వహించగా, 362 జిల్లాల నుంచి 32 వేల మంది పాల్గొన్నారని సర్వే సంస్థ తెలిపింది. 'ఫోన్ కాల్ కలువకపోవటం, కాల్ డ్రాప్ కావటం.. వంటి సమస్యలు ఎదురయ్యాయని సర్వేలో పాల్గొన్న 89 శాతం మంది చెప్పారు. తమ ఫోన్ కాల్స్‌లో 20 శాతానికిపైగా కాల్ డ్రాప్ అయ్యేవని 38 శాతం మంది చెప్పారు' అని సర్వే వివరించింది. కాల్ డ్రాప్ కారణంగా, అనేక మంది వాట్సాప్ వంటి మెసేజింగ్ యాప్‌లు ఆశ్రయించినట్టు చెప్పారు.

# అటకెక్కిన ప్రాజెక్టులు

- కొత్త కంపెనీల ఏర్పాటులో కర్ణాటక కాంగ్రెస్ సర్కార్ ఫెయిల్
- 122 ప్రాజెక్టులకు అనుమతులు
- ప్రారంభమైనవి కేవలం 38 మాత్రమే
- అవినీతి, పారదర్శకతలేమే కారణం
- గత, ప్రస్తుత సర్కారులదే బాధ్యత

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్(నమస్తే తెలంగాణ): 'సిలికాన్ వ్యాలీ ఆఫ్ ఇండియా'గా చెప్పుకొనే బెంగళూరు నగరానికి క్యూ కడుతున్న కంపెనీల సంఖ్య అంతకంతకూ తగ్గిపోతున్నది. పెట్టుబడులకు కేరాఫ్‌గా చెప్పుకొనే కర్ణాటక ఇప్పుడు తన ప్రాభవాన్ని క్రమంగా కోల్పోతున్నది. బీజేపీ, కాంగ్రెస్‌ల పాలనలో గడిచిన ఐదేండ్ల వ్యవధిలో రాష్ట్రం అధోగతి పాలయ్యింది. ప్రభుత్వం విడుదల చేసిన తాజా గణాంకాలు ఈ విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి.



### పెట్టుబడులు ఫుల్.. ప్రారంభాలు నిల్

2018 నుంచి 2023 మధ్య రాష్ర్టానికి రూ. 4.29 లక్షల కోట్ల విలువైన పెట్టుబడులు వచ్చాయి. మొత్తంగా 122 భారీ ప్రాజెక్టులకు ప్రాథమికంగా అనుమతులు లభించాయి. దీంతో దాదాపు 3.52 లక్షల మందికి ఉద్యోగావకాశాలు లభిస్తాయని అందరూ అంచనా వేశారు. అయితే, అనుమతులు లభించిన ప్రాజెక్టుల్లో కేవలం 38 ప్రాజెక్టులు (31.14 శాతం) మాత్రమే కార్యరూపం దాల్చాయి. మిగతా ప్రాజెక్టులన్నీ అటకెక్కాయి. మరికొన్ని పక్కరాష్ర్టాలకు తరలివెళ్లాయి. ఈ జాబితాలో ఐటీ సేవలు, ఈ-కామర్స్, తయారీ, ఏరోస్పేస్, ఫార్మా తదితర రంగాలకు చెందిన కంపెనీలు ఉన్నట్టు పారిశ్రామికరంగ నిపుణులు పేర్కొంటున్నారు.

### కారణాలు ఇవే..

గత బీజేపీ ప్రభుత్వం, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో పేరుకుపోయిన అవినీతి, తుది అనుమతుల్లో తీవ్ర జాప్యం, భూసేకరణ సమస్యలు, పారదర్శకతలేమి తదితర కారణాల వల్లే తొలుత పెట్టుబడులకు సుముఖంగా ఉన్న కంపెనీలు.. ఆ తర్వాత తమ నిర్ణయాన్ని మార్చుకొన్నట్టు పారిశ్రామికరంగ నిపుణులు చెప్తున్నారు. ఫలితంగా రూ. 3 లక్షల కోట్ల మేర పెట్టుబడులు, 2.5 లక్షల ఉపాధి అవకాశాలు కర్ణాటక ప్రజలకు దూరమైనట్టు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## కేజ్రీవాల్ కోమాలోకి వెళ్లే ప్రమాదం

### ఆయన ప్రాణానికి ముప్పు: సంజయ్ సింగ్

న్యూఢిల్లీ, జూలై 15: తీహార్ జైల్లో ఉన్న ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ ఆరోగ్య పరిస్థితి దిగజారుతున్నదని ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఇలాగే ఉంటే.. ఆయన కోమాలోకి వెళ్లిపోయే ప్రమాదముందని ఆప్ ఎంపీ సంజయ్ సింగ్ సోమవారం ఆందోళన వ్యక్తం చేశారు. కేజ్రీవాల్ ప్రాణానికి హాని తలపెట్టే కుట్ర మొదలైందని ఆరోపించారు. అరెస్టుకు ముందు 70 కిలోలున్న కేజ్రీవాల్, ఇప్పుడు 61.5 కిలోలకు తగ్గారని చెప్పారు. దీనికంటే ముందు, కేజ్రీవాల్ ఆరోగ్య పరిస్థితిపై ఆప్ వ్యక్తం చేసిన ఆందోళనల్ని తీహార్ జైలు అధికారులు ఖండించారు. ఆయన ఆరోగ్యం బాగానే ఉందని, వైద్య నిపుణులు నిరంతం పరిశీలిస్తున్నారని తీహార్ జైలు అధికార వర్గాలు వెల్లడించాయి. కోర్టు ఆదేశాల ప్రకారం ఇంటి నుంచి తెప్పించిన ఆహారం అందజేస్తున్నట్టు జైలు సూపరింటెండెంట్ తెలిపారు. దీనిపై స్పందించిన ఎంపీ సంజయ్ సింగ్, కేజ్రీవాల్ ఆరోగ్యంపై తీహార్ జైలు అధికారులు చెబుతున్నదాన్ని కొట్టిపారేశారు. జైల్లో కేజ్రీవాల్ 8.5 కిలోల బరువు కోల్పోయారని, జూన్ 2 నుంచి 14 మధ్య 2 కిలోల బరువు తగ్గారని సంజయ్ సింగ్ తెలిపారు. కేజ్రీవాల్ షుగర్ స్థాయిలు 5 సార్లు పడిపోయినా, జైలు అధికారులు ఆ విషయాన్ని దాచిపెడుతున్నారని ఆరోపించారు.

# ఎంబీబీఎస్ సీట్లు ఇప్పిస్తానని మోసం

- కర్ణాటకలో తెలంగాణ వ్యక్తి అరెస్టు
- విద్యార్థులకు రూ. లక్షలు టోకరా
- 20 లక్షల చొప్పున వసూలు
- పలు రాష్ట్రాల్లో ఇలాగే మోసాలు
- ముంబైలో దాక్కొన్న నిందితుడు

బెళగావి: ఎంబీబీఎస్ సీట్లు ఇప్పిస్తానంటూ పలు రాష్ట్రాలకు చెందిన విద్యార్థులను లక్షల రూపాయల మేర మోసగించిన అరగొండ అలియాస్ అరవింద అరగొండ ప్రకాశంను కర్ణాటకలోని బెళగావి సిటీ పోలీసులు అరెస్టు చేశారు. ప్రకాశంను హైదరాబాద్‌లోని గచ్చిబౌలికి చెందిన నివాసిగా పోలీసులు గుర్తించారు. నిందితుడి వద్ద నుంచి రూ.12 లక్షల నగదు, ఐదు మొబైల్ ఫోన్లు, 12 మానిటర్లు, ఒక ల్యాప్‌టాప్ సీజ్ చేశారు. పెద్దమొత్తంలో డబ్బు ముట్టచెబితే.. ఎంబీబీఎస్ సీటు వచ్చేలా చేస్తానని ప్రకాశం పలు రాష్ట్రాలకు చెందిన విద్యార్థులకు హామీ ఇచ్చి మోసం చేసినట్టు తెలుస్తున్నది. ప్రకాశం 2023లో బెళగావి పట్టణంలో నీట్ గైడెన్స్ సెంటర్‌ను ప్రారంభించాడు. నీట్ తక్కువ స్కోర్ వచ్చిన అభ్యర్థులను టార్గెట్‌గా చేసుకొని, ఎంబీబీఎస్ సీట్లు వచ్చేలా చేస్తానని హామీ ఇచ్చేవాడు. తన మోసాన్ని సులభతరం చేసుకొనేందుకు విద్యార్థులను ఆకర్షించేందుకు ప్రకాశం పలువురు స్థానిక యువతను నియమించుకొన్నాడు. బెల్గాంలోని కనీసం 10 మంది విద్యార్థులు ఈ మోసం బారిన పడ్డారని, ఒక్కొక్కరు కనీసంగా రూ.20 లక్షల చొప్పున చెల్లించారని పోలీసు వర్గాలు తెలిపాయి.



ప్రకాశం

### విద్యార్థిని ఫిర్యాదుతో వెలుగులోకి

ఈ విధంగా మోసపోయిన బీదర్‌కు చెందిన ఒక విద్యార్థిని గత ఏడాది నవంబర్‌లో పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అరవింద అరగొండ ప్రకాశం ఘరానా మోసం వెలుగులోకి వచ్చింది. తర్వాత పోలీసుల దర్యాప్తులో విస్తుగొల్పే విషయాలు బయటకు వచ్చాయి. ప్రకాశం తప్పుడు గుర్తింపుతో చెలామణి అవుతున్నట్టు పోలీసులు గుర్తించారు. ఆ తర్వాత ప్రత్యేక బృందాన్ని ఏర్పా టు చేసి, దర్యాప్తును ముమ్మరం చేయగా.. ప్రకాశం ముంబైలో ఉన్నట్టు గుర్తించారు. అనంతరం పోలీసులు అతన్ని బెళగావికి తీసుకొచ్చి కోర్టు ముందు ప్రవేశపెట్టారు.

### తెలంగాణలో ఆరు కేసులు

ప్రకాశంపై తెలంగాణలో ఆరు కేసులు, మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో ఒకటి, బెంగళూరులో రెండు కేసులు నమోదయ్యాయి. డీసీపీ రోహన్ జగదీశ మాట్లాడుతూ దర్యాప్తు కొనసాగుతున్నదని, మోసపోయిన విద్యార్థులు, వారి కుటుంబాలకు న్యాయం జరిగేలా చూస్తామన్నారు. ప్రకాశం మోసాల బారిన పడిన బాధితులు ముందుకు రావాలని, దర్యాప్తులో సహకరించాలని కోరారు.

## అనారోగ్యకర ఆహార ఉత్పత్తుల ప్రమోషన్ వద్దు

న్యూఢిల్లీ: చక్కెర, ఉప్పు, కొవ్వు పదార్థాలు అధిక మోతాదులో ఉన్న అనారోగ్యకర ఆహార ఉత్పత్తులను ప్రమోట్ చేయవద్దంటూ 16 మంది సెలబ్రిటీలకు వైద్యులు, న్యూట్రిషనిస్టులతో కూడిన న్యూట్రిషన్ అడ్వకసీ ఇన్ పబ్లిక్ ఇంట్రస్ట్ బహిరంగ లేఖ రాసింది. వీరిలో బాలీవుడ్, క్రికెటర్ స్టార్లు ఉన్నారు.

## పేరు మార్చుకుని 11 సార్లు సివిల్స్ పరీక్షకు

ముంబై, జులై 15 ( నమస్తే తెలంగాణ): ట్రైనీ ఐఏఎస్ అధికారిణి పూజా ఖేద్కర్ పేరు మార్చుకుని సివిల్స్ పరీక్షకు హాజరయ్యారని తెలుస్తున్నది. ఇప్పటి వరకు 11 సార్లు పరీక్షకు హాజరైనట్లు సమాచారం. 2020-21 వరకు ఖేద్కర్ పూజా దిలీప్ రావుగా పరీక్షలకు హాజరయ్యారు. 9 సార్లు పరీక్ష ప్రయత్నాలను పూర్తి చేసిన తర్వాత.. పూజా మనోరమ దిలీప్ ఖేద్కర్‌గా పేరు మార్చుకుని మరో రెండు సార్లు పరీక్షకు హాజరైనట్టు తెలిసింది. నిబంధనల ప్రకారం, ఓబీసీ క్యాటగిరీ అభ్యర్థి తొమ్మిది సార్లు పరీక్ష రాయవచ్చు.

## రెండు రోజులుగా లిఫ్ట్‌లో చిక్కుకున్న రోగి

తిరువనంతపురం: కేరళలో 59 ఏండ్ల ఓ వ్యక్తి వైద్య చికిత్స కోసం తిరువనంతపురం ప్రభుత్వ దవాఖానకు వస్తే.. అనూహ్యంగా అక్కడి లిఫ్ట్‌లో చిక్కుకుపోయాడు. అదే సమయంలో అతడి మొబైల్ ఫోన్ కూడా స్విచ్ఛాఫ్ అయ్యింది. 'అలారం' బటన్ నొక్కినా బయట నుంచి అతడికి సాయం అందలేదు. శనివారం లిఫ్ట్‌లో చిక్కుకుపోయిన బాధితుడు సోమవారం ఎట్టకేలకు బయటపడ్డాడు.

## ఇమ్రాన్ ఖాన్ పార్టీపై నిషేధం!

ఇస్లామాబాద్: దేశ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నదన్న ఆరోపణలపై మాజీ ప్రధాని ఇమ్రాన్ పార్టీ పాకిస్థాన్ తెహ్రీక్-ఇ-ఇన్సాఫ్(పీటీఐ)పై నిషేధం విధించనున్నట్టు పాకిస్థాన్ ప్రభుత్వం సోమవారం వెల్లడించింది. విదేశీ నిధుల కేసు, మే 9 నాటి అల్లర్లు తదితర అంశాలు పీటీఐ నిషేధానికి సాక్ష్యాలుగా పనికి వస్తాయని పేర్కొంది.

## ఇంజినీరింగ్‌లో మరో 10వేలకు పైగా సీట్లు

హైదరాబాద్, జూలై 15 (నమస్తే తెలంగాణ): బీటెక్‌లో మరో 10వేలకు పైగా సీట్లు పెరగనున్నాయి. 7 -8 వేల వరకు సీట్ల కన్వర్షన్‌కు అనుమతినిచ్చినవి ఉండగా, మరికొన్ని సీట్ల పెంపునకు సంబంధించినవి ఉన్నాయి. ఆయా సీట్లకు సోమవారం ప్రభుత్వం అనుమతినిచ్చింది. దీంతో ఎప్‌సెట్ మొదటి విడత వెబ్ ఆప్షన్ల నమోదు గడువును 17 వరకు పొడగించారు. వెబ్ కౌన్సిలింగ్‌కు హాజరైన వారంతా వెబ్‌ఆప్షన్లు నమోదుచేసుకోవచ్చని సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన తెలిపారు. సోమవారం వరకు 93,167 మంది వెబ్ ఆప్షన్లు ఎంచుకున్నట్టు శ్రీదేవసేన తెలిపారు.

## డీఎస్సీ హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోండి

హైదరాబాద్, జూలై 15 (నమస్తే తెలంగాణ): డీఎస్సీ పరీక్షలకు దరఖాస్తు చేసుకున్న వారు హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఈవీ నర్సింహారెడ్డి ఒక ప్రకటనలో కోరారు. హాల్‌టికెట్లను వెబ్‌సైట్‌లో పొందుపరిచామని తెలిపారు. 18 నుంచి ఆగస్టు 5 వరకు డీఎస్సీ పరీక్షలు జరగనున్నాయి.

## వారంలో బీటెక్ ఫీజుల పెంపునకు నోటిఫికేషన్!

### 2025 - 28 విద్యా సంవత్సరానికి కొత్త ఫీజులు

హైదరాబాద్, జూలై 15 (నమస్తే తెలంగాణ): 2025-26, 2026-27, 2027-28 సంవత్సరాల ఫీజుల సవరణకు తెలంగాణ అడ్మిషన్స్ అండ్ ఫీజు రెగ్యులేటరీ కమిటీ(టీఏఎఫ్ఆర్‌సీ) వారంలో నోటిఫికేషన్ జారీచేయనుంది. ఇప్పుడు అడ్మిషన్లు పొందే వారికి పాత ఫీజులే వర్తించనుండగా, వచ్చే విద్యాసంవత్సరం నుంచి కొత్త ఫీజులు అమల్లోకి వస్తాయి. అక్టోబర్ 30 వరకు కాలేజీలు ప్రతిపాదనలు సమర్పించేందుకు అవకాశమిచ్చి, నవంబర్, డిసెంబర్‌లో కాలేజీలను ప్రత్యక్ష విచారణకు పిలుస్తారు. ఇంజినీరింగ్‌తోపాటు ఎంబీఏ, ఎంసీఏ, ఫార్మసీ, బయోటెక్నాలజీ ఫీజులను సైతం పెంచుతారు. సోమవారం మాసాబ్‌ట్యాంక్‌లోని టీఏఎఫ్ఆర్‌సీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో చైర్మన్ జస్టిస్ గోపాల్‌రెడ్డి, ఓయూ, జేఎన్టీయూ రిజిస్ట్రార్లు లక్ష్మీనారాయణ, వెంకటేశ్వర్‌రావు, ఉన్నత విద్యామండలి వైస్‌చైర్మన్ వెంకటరమణ, కార్యదర్శి వెంకటేశ్ హాజరై చర్చించారు.

# చదువుల్లో నిమగ్నమయ్యేలా.. సహకరించరూ!

- తల్లిదండ్రులకు విద్యాశాఖ సూచనలు జారీ
- ప్రతి నెలా మూడో శనివారం పేరెంట్ టీచర్ సమావేశాలు

హైదరాబాద్, జూలై 15 (నమస్తే తెలంగాణ): చిన్నారులు ఇంట్లో చదుకునేందుకు రీడింగ్ కార్నర్లు ఏర్పాటు చేయాలి. ఇంట్లో సక్రమంగా చదువుకునే వాతావరణాన్ని కల్పించాలి. శబ్దాలు రాకుండా, అంతరాయం కలగకుండా టీవీ, రేడియో, మొబైల్‌ఫోన్లను ఆఫ్‌చేయాలి. ఇవి విద్యార్థుల తల్లిదండ్రులకు విద్యాశాఖ జారీచేసిన సూచనలు. నూతన విద్యాసంవత్సరం ప్రారంభంకావడంతో అకడమిక్ అంశాలపై విద్యాశాఖ దృష్టిసారించింది. పాఠశాల సహా పిల్లల చదువుల్లో తల్లిదండ్రులను సైతం భాగస్వామ్యం చేసేందుకు పాఠశాల విద్యాశాఖ చొరవ తీసుకుంటోంది. ప్రతీ నెలా మూడో శనివారం బడుల్లో పేరెంట్ టీచర్ సమావేశాలను నిర్వహిస్తుంది. 'పేరెంట్ యాజ్ పార్టనర్స్' థీమ్‌తో 20న రాష్ట్రంలోని అన్ని సర్కారు బడుల్లో పేరెంట్ టీచర్ సమావేశాలను నిర్వహించాలని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్, సమగ్రశిక్ష స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఈవీ నర్సింహారెడ్డి ఆదేశించారు. తల్లిదండ్రులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు. ఆయా జాగ్రత్తలను తల్లిదండ్రులకు వివరించాలని, పాటించేలా చూడాలని హెచ్‌ఎంలకు ఆదేశాలిచ్చారు.



### తల్లిదండ్రులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- ఇంటిని శుభ్రంగా ఉంచడం, వెలుతురు బాగా వచ్చే స్థలంలో రీడింగ్ కార్నర్‌ను ఏర్పాటు చేయడం.
- టీవీ, ఆరుబయట శబ్దాలు వినిపించని చోట రీడింగ్ కార్నర్‌ను ఏర్పాటు చేయాలి.
- ప్రతి రోజు రీడింగ్ కార్నర్‌లో పిల్లలు చదివేలా, గడిపేలా ప్రోత్సహించడం.
- పిల్లల ఏకాగ్రత దెబ్బతినకుండా టీవీ, రేడియో, మొబైల్‌ఫోన్ వంటి వాటిని ఆఫ్‌చేయడం.
- వారు చేయాల్సిన పనులను నిర్దేశించి, పనిపూర్తిచేసిన వెంటనే టిక్‌మార్కు పెట్టమని సూచించడం.
- రోజు బడిలో ఏం నేర్చుకున్నారో, హోం వర్క్ పూర్తి చేశారో లేదో తెలుసుకోవడం.
- ప్రతీ రోజు నచ్చిన పుస్తకం నుంచి రెండు పేజీలు బిగ్గరగా చదవమని ప్రోత్సహించడం.
- సామర్థ్యాల సాధనకు ఇంటింటా చదువుల పంట యాప్‌ను ఉపయోగించడం.

## ఉచిత శిక్షణకు 18న స్పాట్ అడ్మిషన్లు

హైదరాబాద్, జూలై15 (నమస్తే తెలంగాణ): ఉచిత ఉద్యోగ, ఉపాధి శిక్షణకు తెలంగాణ రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ యువతకు 18న స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నది. తెలంగాణ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఫర్ నర్సెస్ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ సీహెచ్ సైదులు సోమవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. 3 నెలల వ్యవధితో ఫార్మసీ అసిస్టెంట్, జనరల్ డ్యూటీ అసిస్టెంట్, ఎమెర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ కోర్సులకు సంబంధించి ఎస్సెస్సీ అర్హత ఉండాలని వివరించారు. 12 నెలల అడ్వాన్స్ డయాలసిస్ టెక్నీషియన్ కోర్సుకు ఇంటర్ పూర్తి చేసి ఉండాలని తెలిపారు. 18 -35 ఏండ్ల నిరుద్యోగులు 18న వనస్థలిపురం బాటా షోరూం, 4ఫ్లోర్‌లో నిర్వహించే స్పాట్ అడ్మిషన్లకు నేరుగా హాజరుకావాలని కోరారు. వివరాలకు 98485 81100, 90599 02355 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

## కాంట్రాక్టు పద్ధతిలో ఎగ్జిక్యూటివ్, డిజైనర్ పోస్టులు

హైదరాబాద్, జూలై 15(నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని చేనేత జౌళి శాఖలో 8 క్లస్టర్ డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటివ్, 22 టెక్స్‌టైల్ డిజైనర్ పోస్టులను కాంట్రాక్టు పద్ధతిలో భర్తీ చేసేందుకు ఆ శాఖ సోమవారం నోటిఫికేషన్ జారీచేసింది. మూడేండ్లకు గానూ మొదటి సంవత్సరం నియమించుకొని పనితీరు ఆధారంగా పొడిగిస్తారు. సీడీఈ పోస్టులకు ఐఐహెచ్‌టీ నుంచి చేనేత టెక్నాలజీలో డిప్లొమా ఉత్తీర్ణతతోపాటు రెండేళ్లు సీడీఈగా పనిచేసిన అనుభవం ఉండాలి. టెక్స్‌టైల్ డిజైనర్ పోస్టులకు నిఫ్ట్/ఎన్ఐడీ లేదా పేరున్న సంస్థ నుంచి డిజైనింగ్‌లో ఉత్తీర్ణతతోపాటు రెండేళ్ల అనుభవం ఉండాలి. నెలకు రూ.24,000 వేతనం ఇస్తారు. ఔత్సాహికులు 21 రోజుల్లోగా నాంపల్లిలోని చేనేత జౌళి శాఖ కార్యాలయంలో బయోడేటా ఇవ్వాల్సి ఉంటుంది.

# బీ క్యాటగిరీ సీట్ల అక్రమ భర్తీకి చెక్ పడేనా?

- నోటిఫికేషన్ రాకముందే సీట్ల భర్తీ
- ఆన్‌లైన్, నోటీస్ బోర్డులో వివరాలు చూపని కాలేజీలు
- చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల డిమాండ్

హైదరాబాద్, జూలై 15 (నమస్తే తెలంగాణ): బీటెక్ మేనేజ్‌మెంట్, ఎన్నారై కోటా సీట్ల భర్తీలో అక్రమాలకు పాల్పడుతున్న కాలేజీలపై ఈ ఏడాదైనా సర్కారు కొరడా ఝుళిపించాలని విద్యార్థి సంఘాలు కోరుతున్నాయి. బీ క్యాటగిరీ సీట్ల భర్తీకి జారీచేసే నిబంధనలను పాటించేలా చూడాలని డిమాండ్ చేస్తున్నాయి. నిబంధనల ప్రకారం కాలేజీలు మూడు భాషల దినపత్రికల్లో నోటిఫికేషన్ జారీ చేయాలి. ఆయా నోటిఫికేషన్‌లో వివరాలను ప్రస్ఫుటంగా పేర్కొనాలి. యాజమాన్యాలు ఆఫ్‌లైన్ లేదా ఆన్‌లైన్‌లో వచ్చే దరఖాస్తులన్నింటిని స్వీకరించాలి. కోర్సుల వారీగా దరఖాస్తు చేసిన విద్యార్థుల జాబితాను వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయడంతోపాటు, నోటీస్‌బోర్డులోనూ పొందుపరచాలి. కానీ ఈ నిబంధనలు కేవలం కాగితాలకే పరిమితమవుతున్నాయి. నోటిఫికేషన్ రాకముందే పలు కాలేజీల్లో సీట్ల కోసం వెళితే లేవన్న మాటలే వినిపిస్తున్నాయి. అంటే నోటిఫికేషన్‌కు ముందే సీట్లు భర్తీ అయిపోయాయి. దీనిపై విద్యార్థి సంఘాలు భగ్గుమంటున్నాయి. కాగా, ఇంజినీరింగ్ బీ క్యాటగిరీ సీట్ల భర్తీకి వారంలో నోటిఫికేషన్ విడుదలకానుంది. కన్వీనర్ కోటా మొదటి విడత సీట్లను 19లోపు కేటాయిస్తారు. బీ క్యాటగిరీ సీట్ల భర్తీకి ఉన్నత విద్యామండలి నోటిఫికేషన్‌ను జారీచేసేందుకు ఏర్పాట్లు చేసుకుంటుంది.





